# ఇద్దరు అమ్మాయిలు

ఉద్యోగం పురుష లక్షణం అని గుర్తించిన పురుష వరే ణ్యులందరికీ, సెలవు మురిగిపోవడం తెలిసే ఉంటుంది. కాజు యల్ లీవ్ ఏ ఏడుది ఆ ఏడుతో మురిగిపోతుంది గనక, రాని తలనొప్పీ, లేని వొళ్ళునొప్పులూ తెప్పించుకుని ఆ సెలవుని వినియోగ పరుచుకోవడం చాలామందికి అనుభవంలో వున్న సంగతే! ఒక లక్ష్మివారం నేనూ అదేపద్ధతి అవలంబించాను.

సెలవ రోజున బద్ధకంగా ఉండటం సహజం. గెడ్డం గీసుకోవచ్చునులే. స్నానం చెయ్యవచ్చునులే;-అని మార్నింగ్ పేపరు యింకొంచెం శ్రద్ధగా చూస్తాం. ఓహో - పాకిస్తాన్ యిలా అంటోందా, కొరియాలో అలా అవుతోందా;-అని మనలో మనం రోజూ కంటె యింకాసేపు విచారిస్తాము. పట్నంలో ఏమేమి సినీమాలు ఉన్నాయో కూడా చూస్తాం- యిలాటి రోజునే. నిద్ర బద్ధకంతో ఆవలిస్తూ అడ్వర్టయిజ్ మెంట్లు చదవడం కూడా కద్దు.

శాంత అప్పటి కప్పుడే రెండుసార్లు వార్నింగ్ యిచ్చింది, స్నానం చేసి కూచో కూడదా-అని. పదికొట్టబోతున్నారు- ఎవరూ కాదు, గడియారం, లుంగీ, బనియనుతో వాలు కుర్చీలో కూచుని, పేపరు మొహానికి అడ్డంగా పెట్టు కున్నాను. రాజాజీపిట్టకథలు నాకు యిష్టం. అందుకని ఆయన ఎక్కడో చెప్పిన ఉపన్యాసం పఠిస్తున్నాను.

వంటయింట్లో నుంచి పడక గదిలోకి ప్రయాణిస్తున్న శాంతాదేవి నా చేతిలో పేపరు వూడలాక్కుని, "శుభ్రంగా స్నానం చేసి పంచెవట్టా వేసుకోకూడదూ ? ఏమిటా వేషం ? తువ్వాలు వుండజుట్టి తలకింద పెట్టుకుంటే సానె అవదూ— ఎడ్డి మేళం," అని నా మెడకింద నున్న తువ్వాలు కూడా లాక్కుంది, పేపరుతో బాటు.

"ఇంకొక్క పది నిముషాలు. ఆ స్పీచ్ పూర్తిచేసి, స్నానం చేస్తాను," అని దీనంగా మనవి చేసుకున్నాను.

"టక్కులు" అని వొక్కముక్క అని, పేపరు నా మొహంమీద పడేసి, "తువ్వాలుతో తుడుచుకోకండి; బీరువాలోనుంచి యింకోతువ్వాలు తీసుకోండి" అంటూ తన పనిమీద తను వెళ్ళిపోయింది.

గజిబిజి అయిపోయిన షీట్లలో ఉపన్యాసం ఏ మూల నుందో వెతుక్కుంటూ వుండగా, సన్నని వుడుకులోన్ పరిమళం నా మీదగా వీచింది. నాకు మొదట్లో అర్థమవలేదు. కుంపట్లో పడ్డ మెరపకాయగొట్టో, లేక కమ్మటి పోపు వాసనో రావలసిన టైము అది. వంటయింట్లోనుంచి పడక గదిలోకి, వుడుకులోన్ రాసుకునే నిమిత్తం శాంతాదేవి ఆ వేళప్పుడు వచ్చి వుండదు. నడవలో వొక పక్కగా కూచున్నానేమో, వీధి వాకిట్లో ఎవరున్నదీ కనిపించలేదు.

గాజుల చేతితో, తెరిచివున్న తలుపుమీద ఎవరో టకటక కొట్టారు. కాలింగ్ బెల్లులు మనకి వుండవు కనక, యింట్లో వున్నవాళ్ళని నాగరీకంగా పిలిచే మార్గం అది.

హడావిడిగా కుర్చీలోనుంచి లేచి ముందుకి వచ్చాను. ఇద్దరు నారీమణులు, వొకరి చేతిలో లెదర్ బాగూ, మరొకరి చేతిలో ఏవో పుస్తకాలూ ఉన్నాయి. ఇద్దరూ ముచ్చటగా డ్రెస్ చేసుకున్నారు.

లోపలకి రండి-అని నేను అనడానికి పూర్వమే, "ఉన్నారా ఆమె?" అంది. వారిలో వొక అమ్మాయి.

లుంగీ, బనియను, మాసిన గెడ్డం, రేగిన క్రాపు-నా అవతారం నాకే సిగ్గేసింది. కాని, సిగ్గుపడి ఏమి లాభం? శాంతాదేవి చెప్పినప్పుడే స్నానం చేసివుంటే, నన్ను ఈ అవతారంలో వాళ్ళు చూసివుండరుకదా! శుభ్రమయిన బట్టలు వేసుకోక ఎందుకు బద్ధకించాలి? తగినశాస్తి అయింది.

"కూచోండి" అని వారికి కుర్చీలు చూపెడుతూ, నేను వంట యింట్లోకి పరిగెత్తాను.

నేను ఆఫీసు ఎగ్గొట్టినందుకు బహుమతిగా శాంతాదేవి బూరెలువండుతోంది.

"ఒకటి రుచి చూస్తారా?" అంది, నేను కనిపించగానే.

"ఎవరో యిద్దరు అమ్మాయిలు వొచ్చారు నీకోసం."

"తెల్లచీరెలూ, బాగూ, పుస్తకాలూ-వాళ్ళేగా!"

"ఆ...ఆ. నీకెలా తెలుసు?"

"తెలుసు లెండి. మనం వొక నెలకొన్న సబ్బు మరొక నెల కొనడం లేదనీ, ఈ నెల వాడిన పౌడరు పైనెల వాడటం లేదనీ. కుంపటిమీద నూనె మాడిపోతుంది గనక ఆమె రాలేకపోయిందనీ చెప్పండి."

ఈ సబ్బులేమిటో, పౌడర్లేమిటో నాకు బోధ పడదు. అయినప్పటికీ, అమ్మగారి మాటలు వాళ్ళకు నివేదించి వుందును. కాని, ఈ అవతారంలో మళ్ళీ వాళ్ళ కంట బడటం ఎలా ?

"చూడు. శాంతా, ఈ వేషంలో నేను బయటికి పోను."

"మీ వేషానికేం దివ్యంగా ఉంది. జట్కాబండి తోలే వాడిలా వున్నారు."

"బూర్లె మూకుడు వ్యవహారం నేను చూస్తాను. నువ్వు వెళ్ళి వాళ్ళని పంపేసిరా."

"నవ్వులాటవన్నా లేదు. అయిదు నిముషాలు ఆగ మనండి-వస్తాను."

"కర్టెన్ వెనకనుంచి నేనా విషయం వెయిట్ చేస్తున్న మహిళలకి తెలియబరిచి, బాత్ రూమ్‌లోకి దూరాను.

స్నానం చేసి, యిస్త్రీబట్టలు వేసుకు నేను బయటికి వచ్చే వేళకి, వాళ్ళు యింకా అక్కడే వున్నారు. శాంతాదేవి వారు యిచ్చిన పుస్తకం తిరిగేస్తోంది.

"నాదేముంది-ఆయన్ని అడగండి" అంది శాంత, నన్ను చూసీ చూడగానే.

నేను ముగ్గురి వంకా బిక్కగాచూశాను, వచ్చిన యిద్దరి అమ్మాయిల్లోకి మాటకారే వుడీకిలోన్ రాసుకున్నట్టువుంది. ఆమె విశదంగా చెప్పింది-విషయం యావత్తూ.

"స్నోలూ పౌడర్లూ గురించి వాకబు చేస్తూ ప్రతినెలా యిద్దరమ్మాయిలు వస్తారు-వారేమో ననుకున్నాను, మీ

మాట చెప్పగానే'' అంది శాంతాదేవి, ఆ యిద్దరు స్త్రీల తోనూ.

సరి–వాళ్లెందుకొచ్చారో చెప్పాలిగా యింక! ప్రతి స్త్రీ తన తీరిక సమయాల్లో, మిషన్ మీద బట్టలు కుట్టుకుంటూ వుంటే, సంవత్సరం మొత్తం మీద ఎంత ఆదా చెయ్య వచ్చునో, కాగితం పెన్సల్ పుచ్చుకు లెక్కలు గట్టి మాకు చూపించారు. వారు అమ్మ దలుచుకున్న కుట్టుమిషన్ ఖరీదు రు 300-0-0 లు ఇదంతా యిప్పుడు యివ్వక్కర్లేదు. నల భయ్యో. ఏభయ్యో యిస్తే చాలు, ఏభై లేకపోతే నలభై. ఆ నలభై పుచ్చుకుని మీకు మిషన్ యిచ్చేస్తారు. ఎంత మంచి వాళ్ళో చూడండి. మిగతా సొమ్మైకం, పన్నెండు నెలలలో ప్రతినెలా ఏడవ తేదీ లోపున కడుతూవుంటే చాలు.

ఇద్దరు పిల్లలూ, వొక భార్యా, వొక భర్త (వాళ్ళు చెప్పిన లెఖ్ఖలు) కలిగిన కుటుంబానికి సాలీనా రు 200-0-0 దర్జీ ఖర్చులకింద అవుతుంది. ముగ్గురు పిల్లలూ, వొక భార్యా, వొక భర్త కలిగిన కుటుంబం అయితే, యిం కొంచెం ఎక్కువగావచ్చు. రు 200-0-0 అవదంటారా? అవుతుందట. బడికి వెళ్ళే యిద్దరు పిల్లలకి, వొక్కొక్కళ్ళకి డజను డ్రెస్సుల చొప్పున రెండు డజనుల డ్రెస్సులు కావాలి. రెండు రూపాయిలు యివ్వనిదే, ఏ దర్జీ డ్రెస్సు కుడతాడు? డజనుకీ రు 48-0-0.

''మీామట్టుకు మీరు, పన్నెండు కాటన్ జాకెట్లూ, పన్నెండు సిల్కు జాకెట్లు కుట్టించుకోకుండా వుంటున్నారా

ప్రతిపదూ ?" ఇది ప్రతిష్ఠకి సంబంధించిన ప్రశ్న. అంచేత, శాంతాదేవి అవునన్నట్లు తలపూపింది. 'కాటన్ జాకెట్ కి రూపాయి' సాదాసిల్కు జాకెట్ కి రెండు రూపాయిలు—హీనంగా చూసుకుంటే రు 36-0-0 వొట్టి జాకెట్లకే అవుతుంది. పెట్టీకోట్స్ తదితరములూనో !

భర్తగారి విషయం, సంవత్సరానికి ఆరు కాటన్ సూట్సు అయినా కుట్టించుకోవాలిగదా !—పోసీ నాలుగు. నాలుగు యిరవైలు-పోసీ. నాలుగు పదిహేనులు. వొక్క డజన్ షర్టులు—షర్టుకి రెండురూపాయిల చొప్పున.

ఇంక, ఇంటి మొత్తానికి కావలసిన గలేబులూ, కర్టెనులూ, టేబుల్ క్లాత్ లూ వగైరాలు వున్నాయి. భర్తగారి సూట్లలో సిల్కువీ, వులెన్ వీ కలపలేదు సుమండీ—అవి బయటనే కుట్టించుకోవచ్చు. ఈ ప్రకారం లెక్క కట్టుకు వెళ్తే—ఇద్దరు పిల్లలూ, వొక భార్యా, వొక భర్త కలిగిన కుటుంబానికి సాలీనా రు 238-0-0 దర్జీ ఖర్చులకింద అవుతాయని తేలింది. రు 38-0-0 కొట్టెయ్యమంది—రెండో అమ్మాయి. అనగా సంవత్సరానికి రు 200-0-0 పద్దెనిమిది నెలల్లో మీసొమ్ము మీకు వచ్చేస్తుంది; అదనంగా మిషన్ మిగులుతుంది.

ఈ లెక్కలువింటే తలనొప్పి వస్తోందా ? నాకూ వచ్చింది కాని బూరెలు తిన్నమీదట పోయింది.

* * * *

మర్నాటికల్లా మా ఇంట్లో కుట్టుమిషన్ తయారయింది. పండక్కి చీరె కొనుక్కోమని వాళ్ళ వాళ్లు పంపిన ఏభై రూపాయిల్లోనూ, నలభై కంపెనీలో కట్టి, మిషన్ తెచ్చుకుంది శాంత. ఆ నలభై నెలాఖరున నేను శాంతకి యివ్వాలి.

కుట్టుమిషన్ కొన్నందుకు నేనేమీ బాధపడలేదు. ఏదో ఇద్దరమ్మాయిలు వచ్చారు 'ఇద్దరు పిల్లలు' మాకు లేరు గనుక మాసొమ్ము మాకు వచ్చేందుకు రెండేళ్ళు పడుతుంది-అన్నారు. ప్రతినెలా ఇరవయ్యో పాతికో కదా, ఇంట్లోకి వొక వస్తువు అమరుతుంది - అనుకున్నాను. శాంతాదేవిని మాత్రం వొకే వొక్క కోరిక కోరాను—"షర్టులు నువ్వు కుడుదువుగాని, సూట్లు బయట కుట్టించుకుంటాను"-అని,

"ఉండండి—ఇంకా కత్తిరింపులు నేర్చుకోనిదే!"

బజారునుంచి గుడ్డ పట్టుకొచ్చి పాతషర్టు ముందు పడేసుకుని, ట్రేస్ తీసినట్టు, టపాటపా కత్తిరించేస్తారనుకున్నాను. కత్తిరింపులంటూ నేర్చుకోవలసినది కొంత వుందన్నమాట, బతికాం-అనుకున్నాను.

కత్తిరింపులు ఎవరో ఆడ టీచరు దగ్గిర నేర్చుకోవడం మొదలెట్టింది శాంత. రు 22-14-0 చెక్కు పంపిస్తున్నప్పుడు తప్ప, మిగతా వేళల ఆ మిషన్ సంగతే మర్చిపోయాను. వొక రోజు పొద్దున్న ఆఫీసుకి వెళ్తున్నప్పుడు, ఇస్త్రీ జేబురుమాలు కనిపించక పోయేటప్పటికి, ఆ సాయంత్రం ఇంటికి

రాగానే, పాత ఫిన్‌లే పంచెపుచ్చుకు మిషన్ ముందు కూచున్నాను.

"అదేమిటి?" అంది శాంత.

"నేను జేబురుమాళ్లు కుట్టుకోవాలి."

"నా పెట్లో కొత్తవి ఉన్నాయి."

"ఉండనీ. ఈ పాతపంచె గిన్నెలవాడికి ఇచ్చేబదులు జేబురుమాళ్ళు కుట్టుకుంటాను."

మొగవాళ్ళు వొక్కొక్క సందర్భంలో మంకుపట్టు పడతారని శాంతకి తెలుసు కాబోలు. అంచేత, వూరుకుంది.

"నేను కుట్టిపెట్టనా?" అంది, రెండు నిముషాలు ఆగి.

"ఊహు. వొక్కొక్క అక్షరమే ఏరి, అడ్రస్ టైపు చేస్తావుగా—నా టైప్‌రైటర్ మీద. అలాగే కుట్టుమిషను మీద నేను జేబు రుమాళ్ళు కుట్టుకుంటాను."

"అబ్బో" అని సాగదీసుకుంటూ, నా వీపుమీద వాలి, తన గెడ్డం నాభుజంమీద ఆనించింది.

* * *

మట్టుకత్తిరింపులు నేర్చుకుంటున్నప్పుడే, వొక సాయంత్రం వేళ అంది: "ఎదురింటి వర్ధనమ్మ, పొరుగింటి కాంతమ్మ, ఆ కాంతమ్మ కూతురు విశాలాక్షీ నా ప్రాణాలు తోడేస్తున్నారు."

"ఏం—ఏం?" అన్నాను.

"వెధవ దారపుపుండలూ వాళ్ళూను! దారం ఎక్కించడం కూడా చేతకాదు, దారపు వుండ పుచ్చుకు తయారవుతారు."

"ఏమిటి జరిగింది ?"

"వాళ్ళదారపు వుండలకి నేను కరువు వాచి వున్నాననుకున్నారు. కాంతిమ్మని కుట్టుకోనిచ్చానని వర్ధనమ్మా, వర్ధనమ్మని కుట్టుకోనిచ్చానని కాంతమ్మా - వెధవ వంతులూ వాళ్ళూను. ఆ కాంతిమ్మ కూతురు విశాలాక్షి మన మిషన్ మీద కుట్లు నేర్చుకుని, పరీక్షకి వెళ్తుందట."

"వాళ్ళందరినీ ఎందుకు చేరనిచ్చావ్. నా మిషన్ పాడైపోయిందని చెప్పక పోయావు ?"

"ఆ...అదీ చెప్పాను. కాంతిమ్మ వాళ్ళతమ్ముణ్ణి పట్టుకొచ్చింది,-వాడికి మిషన్ బాగుచెయ్యడం వచ్చని."

"భేష్ ! బావుంది."

"ఈ మిషన్ మా వాళ్ళింటికి పంపించేస్తే ! లేకపోతే మీరు తెలిసిన వాళ్ళెవరింట్లోనైనా దాచండి. ఈ వర్ధనమ్మా గిర్ధనమ్మలతో, మధ్యాహ్నంపూట వొకగంట నడుంవాల్చడానికి వీలు లేకుండా వుంది !"

ఇంత డబ్బుపోసి మిషన్ కొనుక్కోవడ మేమిటి, ఇరుగూ పొరుగుకి భయపడి దాచుకోవడ మేమిటి ! "చూదాం" అని శాంతని ఆ పూటకి సముదాయించాను.

* * *

మర్నాడు ఉదయం మళ్ళీ వుడుకులోన్ వాసన వచ్చింది. వుడుకులోన్ వాసన వెంట వెనకటి అమ్మాయిలే వచ్చారు. వీధి తలుపుమీద కొట్టకుండా, తిన్నగా లోపలకి వచ్చారు. ఆఫీసుకి రెడీ అయ్యే ప్రయత్నంలో టైకట్టుకుంటూవున్నాను; భోజనం అయింది.

"ఈసారి ఏంకొనిపిస్తారు ?" అన్నాను, నవ్వుతూ. వాళ్లు కుర్చీల్లో కూచున్నారు; శాంతా దేవి వారితో లోకాభిరామాయణం కాబోలు మాట్లాడుతోంది.

"వాషింగ్ మిషన్," అంది, ఇద్దరిలోకీ మాటకారి అని చెప్పానే, ఆ అమ్మాయి.

"శాంతా, రెండు మిషనులూ కలిపి మీ వాళ్ళింటికి పంపించవలసి వస్తుందేమో !"

నా జోక్ ఆ అమ్మాయిలకి అర్థమై వుండదు. కాని నేను ఆఫీసుకి వెళ్ళాక శాంత వారికి చెబుతుందిగా కథ.

"చాకలిమూట బుజాన్ని వేసుకు మానింటికి వస్తారంటారా ? రానీ-చూదాం. పనిలో పని-మన బట్టలుకూడా వుతికి పెట్టమంటాను.

"నీకు అంత ధైర్యం కూడానా ?"

"చూదురుగాని !"

వాషింగ్ మిషన్ వచ్చింది; ఇంక శాంతా దేవి ధైర్యాన్నే...చూడాలి.